# హైదరాబాద్ వార్త



# ఆశావహులకు టికెట్ల గుబులు

పైరవీల ద్వారా అయితే పలువురు సీనియర్లు, ముఖ్యమైన నాయకులకు టికెట్లు వచ్చే అవకాశం ఉంది. కానీ గెలవడం, సాధ్యం కాదు అని అంటున్నారు. మొత్తం గ్రేటర్ వ్యాప్తంగ కాంగ్రెస్ పార్టీ జాబితా కోసం ఆ పార్టీ శ్రేణులే కాకుండా ఇతర పార్టీల వారు, రాజకీయ నిపుణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాబితా విడుదలకు సమయం దగ్గర పడడంతో టికెట్ వస్తుందో రాదోననే ఆందోళన మొదలైంది.



హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త : కాంగ్రెస్‌లో ఆశావహులకు టికెట్ల గుబులు పట్టు కుంది. తొలి జాబితాలో మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ముషీరాబాద్, మలక్‌పేట్, సనత్‌నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. మిగిలిన నియోజకవర్గాల టికెట్ల కోసం ఆశావహులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఒక్కో స్థానంలో ఇద్దరు, ముగ్గురు తీవ్రంగా పోటీపడుతున్నారు. అధిష్టానం ఎవరి అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపుతుందోనని మదనపడుతున్నారు. వాస్త వానికి తొలిదఫాలో అసమ్మతులు లేని, ఆశావహుల పోటీ తక్కువగా ఉన్నచోట టికెట్లను కాంగ్రెస్ ఖరారు చేసింది. పార్టీ అంతర్గత సర్వేల్లో ఒక్కరికి పూర్తిగా సానుకూలమని తేలిన నియోజకవర్గాలోనే అభ్యర్థులను ప్రకటించినట్లు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ తెలిపారు. మిగిలిన చోట్ల అచితూచి, అందరికీ అమోదయోగ్య మైన అభ్యర్థుల్ని రంగం లోకి దించుతామన్నారు. ఇప్పటి వరకు టికెట్లు ఖరార వని నియోజకవర్గాల రేసు గుర్రాలెవరో తేలాల్సి ఉంది. గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో పాతబస్తీ మినహా ఇతర సెగ్మెంట్ల నుంచి దరఖాస్తులు దండిగా వచ్చాయి. అయితే జాబితా విడుదలకు సమయం దగ్గర పడుతుం డడంతో కాంగ్రెస్ అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఒకరిద్దరు నడుమనే అంతంత మాత్రంగా పోటీ ఉండగా తాజాగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అభ్యర్థుల సంఖ్య పెరగడంతో పాటు టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. మొదటి విడత జాబితాలో మల్కాజిగిరి–మైనంపల్లి హనుమంత రావు, మేడ్చల్–తోటకూర వజ్రేష్‌యాదవ్ (తోటకూర జంగయ్య యాదవ్), కుత్బుల్లాపూర్–కొలను హనుమంతరెడ్డి, ఉప్పల్–ఎం.పరమేశ్వర్‌రెడ్డి, ముషీరాబాద్–ఎం.అంజన్ కుమార్ యాదవ్, మలక్‌పేట్–షేక్ అక్బర్, సనత్‌నగర్–డాక్టర్ కోట నీలిమ, నాంపల్లి–మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, కార్వాన్–ఒస్మాన్ బిన్ మహమ్మద్ అలీ హాజ్రీ, గోషామహల్–మొగిలి సునీత, చంద్రాయణగుట్ట–బోయ నగేష్ (నరేష్), యాకుత్‌పురా–కె.రవిరాజు, బహదూర్‌పురా–పులిపాటి రాజేష్‌కు మార్, సికింద్రాబాద్–అడమ్ సంతోష్‌కుమార్‌లు మాత్రమే సంబంధించి అభ్యర్థులను ప్రకటించారు. ఇక అంబర్‌పేట టికెట్ కోసం ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నూతి శ్రీకాంత్‌గౌడ్‌లు పోటీ పడుతున్నారు. ఆర్ లక్ష్మణ్‌యాదవ్‌కు మాజీ ఎంపి వి.హనుమంతరావు వంతపాడుతుండగా, నూతి శ్రీకాంత్ గౌడ్‌కు కొందరు సీనియర్ నాయకులు మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ఈ నియోజకవర్గాన్ని పక్కన పెట్టినట్లు సమాచారం. మహేశ్వరం టికెట్‌ను బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డికి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. లేనిపక్షంలో చల్ల నర్సిం హారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి లలో ఒకరికి అవకాశం ఉంది. రాజేంద్ర నగర్ నుంచి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కస్తూరి నరేందర్, శేరిలింగంపల్లి నుంచి మంగళ వారం బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ల దంప తులతోపాటు టికెట్ ఆశిస్తున్నవారిలో జెరిపేటి జయపాల్, సత్యనారాయణ, ఎం.రఘునాథ్ యాదవ్, ఖైరతాబాద్ నుంచి రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డి, కూకట్‌పల్లి నుంచి గొట్టిముక్కల పద్మారావు, సత్యం శ్రీరంగం, కంటోన్మెంట్ నుంచి సర్వే సత్యనారాయణ, పిడమర్తి రవి, జీవకన్‌లు టికెట్టు ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలి అన్న నిర్ణయంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ ప్రాతిపదికన టికెట్లను కేటా యిస్తారన్న అంశం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. సర్వేల ఆధారంగా అయితే చాలా మంది సీనియర్లకు అవకాశం దక్కకపోవచ్చు అని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

## 2 కోట్ల విలువగల పట్టు చీరెలతో ఉన్న రెండు లారీల పట్టివేత



నిజాంపేట్, అక్టోబర్ 18, ప్రభాతవార్త : బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో పంచవటి అపార్ట్‌మెంట్‌పై పోలీసులు దాడి చేశారు. రూ.2,25,98,590 విలువచేసే 743 బ్యాగ్‌లలో ఉన్న పట్టుచీరలను 2 లారీలతో ఆపార్ట్‌మెంట్‌లో ఓ డబుల్ బెడ్‌రూమ్‌లో డంప్ చేస్తున్న సమయంలో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ ప్రాంతంలో ఉండే కాశంపుల్లయ్య, మాంగల్య షాపింగ్ మాల్స్ నుండి చీరలు కొన్నట్లు యజమాని పోలీసులకు తెలుపుతున్నాడు. పట్టుచీరల లోడ్‌లతో ఉన్న 2 లారీలను బాచుపల్లి పోలీసుల సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఎలక్షన్ సమయం ఉన్నందున ఓటర్లకు పంచడం కోసమే ఈ చీరలు ఇక్కడికి తీసుకొచ్చారని స్థానికులు అనుమానం వ్యక్తం వెలిబుచ్చారు.

## మీర్‌చౌక్ డివిజన్‌కు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సమావేశంలో పాల్గొన్న దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య

చార్మినార్, అక్టోబరు 18 ప్రభాతవార్త : రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని దక్షిణ మండలం డిసిపి పి.సాయి చైతన్య హెచ్చరించారు. మీర్‌చౌక్ డివిజన్ పరిధిలోని మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీ నగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన రౌడీషీటర్లకు బుధవారం యాకుత్‌పురలోని క్రిస్టల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా దక్షిణ మండలం డిసిపి సాయి చైతన్య మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగేలా రౌడీ షీటర్లు వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్, మీర్‌చౌక్ ఎసిపి వెంకటేశ్వరరావు, రెయిన్‌బజార్ సిఐ మధుసూధన్‌రెడ్డి, భవానీ నగర్, మీర్‌చౌక్ సిఐలతో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా మీర్‌చౌక్ డివిజన్‌కు చెందిన 48 మంది రౌడీషీటర్లుకు కౌన్సిలింగ్ ఇచ్చారు.



### ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో
## అన్నపూర్ణాదేవి అలంకారం

బేగంపేట అక్టోబరు 18, ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవ రాత్రి ఉత్స వాలలో భాగంగా వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారి ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ గుత్తా మనోహార్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహిత హనుమాన్ చౌదరిని మార్యదపూర్వకంగా కలిసిన వికాస్ మంచ్ నేతలు



కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షుడు గడ్డం ఏబెల్, ప్రధానకార్యదర్శి సంకి రవీందర్‌బాబు షఫీలు కంటోన్మెంట్ వాస్తవ్యుడు పద్మశ్రీ అవార్డు గ్రహిత టి. హనుమాన్ చౌదరిని మార్యాదపూర్వకంగా కలిశారు. కంటోన్మెంట్ ప్రజల ఆత్మగౌరవం, అభివృద్ధి కొరకు సిద్దం చేస్తున్న పబ్లిక్ మెనిఫెస్టోపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. వికాస్‌మంచ్ చేస్తున్న విలీన పోరాటాన్ని అభినందిస్తూ పబ్లిక్ మెనిఫెస్టోపై వారి పూర్తి మద్దతును ప్రకటించారు. విలీన ఆవశ్యకతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తానన్నారు.

## ప్రయాణికులకు ఆర్టీసి దసరా కానుక

అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 18ప్రభాతవార్త: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని టిఎస్ ఆర్‌టిసి బుధవారం నుంచి లక్కి డిప్ స్కీంను ప్రవేశ పెట్టినట్లు రంగారెడ్డి రీజియన్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఈ లక్కిడిప్‌లో భాగంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో కూడా ఈనెల 30 వరకు కొనసాగు తుంది. బస్సుల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనుకాల ప్రయాణికుల పేరు, వారి ఫోన్ నెంబర్ వ్రాసి బస్టాండ్‌లో మహిళలు, పురుషుల కోసం వేర్వురుగా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లలో ఐదుగురు పురుషులు, చొప్పున, మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి 9వేల900 చొప్పున బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ముగిసిన బాస్కెట్ బాల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న మల్కాకొమురయ్య

నాచారం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో గత మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిపిఎస్ సొసైటీ...ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ బుధవారం విజయవంతంగా ముగిసాయి. ఈ టోర్నమెంట్‌లో దక్షిణ, మధ్య భారతదేశం నుంచి మొత్తం 14 పాఠశాలలు పాల్గొన్నాయి. పోటీలకు బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ నార్మన్ స్వరూప్ ఇసాక్, సీనియర్ నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ మొదటి ప్రధాన కోచ్ డా. యూజీన్ జార్జ్ పాల్గొన్నారు. ముగింపు వేడుకలకు అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు విశాల్, బాస్కెట్ బాల్ క్రీడాకారుడు శ్రీనాథ్, డిపిఎస్ చైర్మన్ మల్కాకొమురయ్య, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మల్కా యశస్వి హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునితా రావు, వైస్ ప్రిన్సిపల్ గౌరి, అంకితతో పాటు పలువురు పాల్గొన్నారు. డిపిఎస్ బెంగళూరు సౌత్ ఈ డిపిఎస్ సైటీ బాస్కెట్ బాల్ టోర్నమెంలో విజేతలుగా నిలిచి ట్రోఫిని గెలుచుకుంది. మొదటి రన్నర్ ఆఫ్ ట్రోఫిని డిపిఎస్ బెంగళూరు నార్త్, రెండోరన్నర్ ఆఫ్ ట్రోఫిని డిపిఎస్ బెంగళూరు ఈస్ట్ గెలుచుకున్నాయి.

## కూకట్‌పల్లిలో బంగారం పట్టివేత

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త : ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నగదుతో పాటు బంగారం కూడా పట్టుపడుతూనే ఉంది. బుధవారం పోలీసులు కెపిహెచ్‌బి కాలనీలో తనిఖీలు నిర్వహిస్తుండగా 3.193 కేజీల బంగారం, 1.56 కేజీల వెండని పోలీసుల సీజ్ చేశారు. కెపిహెచ్‌బి కాలనీలో పిఎన్‌ఆర్ ఎంపైర్ బిల్డింగ్ వద్ద తనిఖీలు చేస్తుండగా టిఎస్09యుడి1742 నంబర్ గల కారుతో మహమ్మద్ ఇబ్రాన్ (27), బీరేంద్రసింగ్ (54), ఎం. విజయ కుమార్(38)లు వెళుతుండగా తనిఖీలు నిర్వహిం చారు. వారి వద్ద గల నల్ల కలర్ బ్యాగులో బంగారంతో పాటు వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి వద్ద బంగారంకి వెండికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాష్ట్రపతి నిలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

# యాప్‌లు రెడీ!

**ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఎన్నికల సంఘం సాంకేతిక వినియోగం**

**అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు ఈ క్రతువులో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఎన్నికల సంఘం సాంకేతికను వినియోగిస్తోంది. ఇటు ఓటర్లు, అటు అభ్యర్థులు, అధికారులకు ఉపయోగపడేలా పలు యాప్‌లను సిద్ధం చేసి ఉపయోగిస్తోంది. పలు పోర్టల్లు, వెబ్‌సైట్‌లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా వాటి పని నీరు వాడే విధానంపై ప్రత్యేక కథనం..**

హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త :

**సీ-విజిల్..** ఎన్నికల్లో అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా సీ-విజిల్ పేరిట యాప్‌ను తెచ్చింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా ప్రవర్తించినా సాధారణ ప్రజలు నేరుగా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు రావచ్చు. నిబంధనలకు విరుద్ధంగా చేసే ప్రచారంతో పాటు ఇతరత్రా ప్రలోభాల సంఘటనలకు సంబంధించిన వీడియోలు లేదా చిత్రాలకు యాప్‌లో నమోదు చేస్తే వంద నిమిషాల్లో చర్యలు తీసుకునేలా యాప్‌ను ఆధునికీకరించారు. అందుకే దీన్ని ఓటరు బ్రహ్మాస్త్రంగా సంబోధిస్తున్నారు.

**సువిధ..** సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కార్యాలయానికి వెళ్లకుండానే అనుమతులు తీకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా సువిధ యాప్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చింది. 48 గంటల ముందు ఇందులో నమోదు చేయాల్సి ఉంటుంది. పోలీస్, రెవెన్యూ, ఎన్నికల సంఘం అధికారులకు యాప్‌లో లాగిన్ సౌకర్యం ఉంది. నిబంధనలు, నియమావళికి అనుగుణంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తారు. విరుద్ధంగా ఉంటే తిరస్కరిస్తారు. కారణాలు సైతం తెలియజేస్తారు.

**అభ్యర్థి వివరాలు..** అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసిన ప్రమాణ పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఎన్నికల సంఘం 'నో-యువర్ క్యాండిడేట్, కేవైసీ' పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిందింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ఎలాంటి వారు? నేర చరిత్ర ఏమైన ఉందా? ఆస్తులు ఎన్ని ఉన్నాయనే వివరాలు ఈ సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

**సక్షం..** 40 శాతానికిపైగా వైకల్యం, 80 ఏళ్లకుపైబడిన వారు ఇంటి వద్ద నుంచే ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఈసీ మొదటిసారి అవకాశం కల్పించింది. 12(డి) ఫారం పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతకంటే తక్కువ వైకల్యం, వయోభారంతో బాధపడుతున్న వారూ సులభంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా సక్షం అనే యాప్‌ను రూపొందించారు. సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబరు సాయంతో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ ఆధారంగా మనమే పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. అనంతరం యాప్‌లో నిర్దేశించిన సేవలను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ముఖ్యంగా పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది? ఎటు వంటి సౌకర్యాలున్నాయి? అనే వివరాలను తెలుసుకోవచ్చు.

**సుగమ్..** ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారం సందర్భంగా రెండు వాహనాలను మాత్రమే వాడాలి. సభలు, సమావేశాల సందర్భంగా మరో నాలుగింటికి అనుమతులు తీసుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా ఈసీ నియమావళిని రూపొందించింది. అనుమతి లేకుండా ప్రచారానికి వాహనాలను వినియోగిస్తే వాటిని సీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల అనుమతికి ప్రత్యేకంగా సుగమ్ పేరిట యాప్‌ను రూపొందించారు. వివరాలు నమోదు చేసి అనుమతి లభించాకే నిర్దేశిత వాహనాలను ప్రచారానికి వినియోగించాలి.




**ఈ-ఎస్ఎంఎస్..** తనిఖీలలో దొరికే నగదు, మద్యం, డ్రగ్స్, బహుతులను ఎప్పటికప్పుడు ఆయా సంస్థలకు అప్పగించడానికి, డబ్బును బ్యాంకులలో డిపాజిట్ చేయడంతో పాటు ఐటీ శాఖను సకాలంలో అప్రమత్తం చేయడానికి ఈ-ఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) అనే యాప్‌ను తీసుకొచ్చింది. ఎన్నికల క్రతువులో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొనే అధికారులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు వివరాలను అందులో పొందుపరచాల్సి ఉంటుంది.

**ఈటీపీబీఎస్..** పోస్టల్ బ్యాలెట్ జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు గాను ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఈటీపీబీఎస్ (ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మీటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్)ను ప్రవేశపెట్టింది. సర్వీస్ ఓటర్లతో పాటు ఉద్యోగులు ఈ సైట్ ద్వారా దరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ఓటరు సహాయకారి..** ఓటర్లకు సహాయకారిగా ఉండేందుకు 'మై ఓటర్ హెల్ప్‌లైన్ యాప్'ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఓటరు కార్డు ఎపిక్ నంబర్ నమోదు చేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉందనే వివరాలు తెలియనున్నాయి. .

## ప్రవళిక ఆత్మహత్య ఘటనలో ఎంపి లక్ష్మణ్, విద్యార్థి నేతలపై కేసులు

చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త: నిరుద్యోగ యువతి మర్రి ప్రవళిక ఆత్మహత్య ఘటనలో ఆ రోజు జరిగిన ఆందోళనలలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నేతలపై చిక్కడపల్లి పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. ఇటీవల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రవళిక అశోక్‌నగర్‌లోని తన హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె ఆత్మహత్య చేసుకుందన్న విషయం తెలుసుకున్న విద్యార్థి, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో సంఘటనాస్థలానికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్దఎత్తున ధర్నాకు దిగారు కూడా. కాంగ్రెస్ నేతలతో పాటు బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, డిసిసి అధ్యక్షుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్, వందలాది మంది నిరుద్యోగులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేయడంతో పెద్దఎత్తున ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసు విషయంలో చిక్కడపల్లి సిఐ పి.నరేశ్ బాధ్యతగా వ్యవహరించలేదని ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిలియా ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సంఘటన సంచలనం కలిగించడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రవళిక ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే విద్యార్థులకు మద్దతుగా అక్కడికి చేరుకున్న రాజకీయ నాయకులు, విద్యార్థి నాయకులను పోలీసులు ఆ సమయంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రవళిక చనిపోవడానికి కారణం గ్రూప్–2 వాయిదా కారణమంటూ ఆందోళకు దిగిన 13 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఉన్నతాధికారులపై ఆదేశాల మేరకు వారందరిపై ఐపీసీ సెక్షన్స్ 143, 148, 341, 332 రెడ్‌విత్, 149 కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.అనీల్ కుమార్‌యాదవ్, నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఫిరోజ్‌ఖాన్, కార్పొరేటర్ విజయారెడ్డి, ఓయు నేత సురేశ్‌యాదవ్; భాను ప్రకాశ్, నీలిమ, జీవన్‌లపై కేసులు నమోదు చేశారు.

పోలీసులప ఐ రాళ్ళు రవ్వా రని అభియోగాలపై కూడా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఇప్పటికే ఆత్మహత్య కేసులో నిందితుడు మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ప్రాంతానికి చెందిన శివరామ్ రాథోడ్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రియుడి మోసం వల్లే మర్రి ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడినట్లు చిక్కడపల్లి పోలీసులు నిర్ధారించికేసులు నమోదు చేయడం, నిందితుడిగా ఉన్న శివరామ్ రాథోడ్ తనను మోసం చేశారని ప్రవళిక తన సోదరుడు ప్రణయ్‌కు వాట్సాప్ సందేశాల ద్వారా తెలపడం, ఈ మేరకు ప్రణయ్ పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడం కొసమెరుపు.

## ఆచార్య కొలకలూరి ఇనాక్ చేత ఆవిష్కరించిన అర్ధ శతాబ్దిలో అమెరికా కథ గ్రంథం



ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను సన్మానిస్తున్న ఆశాజ్యోతి, రామ్, ఇందిర, జితేందర్‌రెడ్డి, చిట్టెన్‌రాజు

రవీంద్రభారతి, అక్టోబరు 18 ప్రభాతవార్త : వంగూరి చిట్టెన్‌రాజు ప్రధాన సంపాదకుడుగా, డా. సి.మృణాళిని సహ సంపాదకురాలిగా కేంద్రసాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ ప్రచురించిన అర్ధ శతాబ్దిలో అమెరికా కథ అనే చారిత్రిక కథా సంకలనాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార స్వీకర్త, సుప్రసిద్ధ సాహితీవేత్త పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మొట్టమొదటిసారిగా అమెరికా టెక్సస్ రాష్ట్రంలో హూస్టన్‌కు వచ్చిన సందర్భంగా హూస్టన్ సాహితీలోకం వారి తెలుగు వెన్నెల బృందం తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించగా, విదేశాల్లో నివసిస్తున్న రచయితల కథలు ప్రచురించడం సాహిత్య అకాడమీ చరిత్రలో ఇదే మొట్టమొదటి సారనీ, ఈ గ్రంథ సంకలనానికి నాలుగు సంవత్సరాల వ్యవధి పట్టిందని, ఈ గ్రంథం ఆచార్య ఇనాక్ చేత ఆమెరికాలో తొలిసారి వెలుగు చూడడం అదృష్టంగా భావిస్తున్నామని వంగూరి చిట్టెన్‌రాజు ఆనందోత్సాహాలను వెల్లడించారు. సురేష్ పిల్లుట్ల స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖ రచయిత డా. గిరిజా శంకర్ వయసు మీరిన చమత్కారం అనే అంశం మీద హాస్యం, మన మెదడు పని చేసే వైద్యశాస్త్రం మీద ప్రసంగం కావించారు. అనంతరం ఆచార్య కొలకలూరి ఇనాక్ సమాజము, సాహిత్యమూ, పరస్పర ప్రభావాలు అనే అంశం మీద సాధికారికంగా, అనేక అంశాలని స్పృశిస్తూ ప్రసంగంచేసి ఆహుతులను ముగ్ధులనుజేసి ఆలోచింపజేశారు. తర్వాత జరిగిన ముఖాముచలో సభికుల ప్రశ్నలకి ఇనాక్ సముచితరీతిలో స్పందించి జవాబులిచ్చారు. చివరిగా హ్యూస్టన్ సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు ఆశాజ్యోతి, సభ్యులు గొడవర్తి రామ్, ట్రస్టీ చెరువు ఇందిర, జితేందర్‌రెడ్డి, తదితర నిర్వాహక బృందం ఇనాక్‌ను ఘనంగా సత్కరించారు.

## ఉల్లికి మళ్లీ గడ్డు రోజులు

### భారీగా పెరుగుతున్న ఉల్లి ధరలు



హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త : ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదు అని అంటారు. అలాంటి ఉల్లి ధర ఇప్పుడు ఆకాశం వైపు దూస్తోంది. ఉల్లి ధరలు మళ్లీ పెరిగాయి. కిలో ఉల్లిగడ్డ ధర రోజుకో ధర పలుకుతోంది. ఉల్లి లేనిది ఏ కూర ఉండదు. అలాంటి ఉల్లి ఇప్పుడు సామాన్యులకు కన్నీరు పెట్టిస్తోంది మొన్న కిలో ఉల్లి ధర రూ.15లు ధర పలకగా నిన్న అదే ఉల్లి ధర రూ.32లు ధర పలికింది. నేడు అమాంతంగా ఉల్లి ధర ఏకంగా రూ.42లు కిలో ఉల్లి ధర పలికింది. అంటే మొన్నటితో పోలిస్తే మూడు రేట్లు ఉల్లి ధర పెరిగింది. దీంతో సామాన్యులు కొనాలంటేనే భయపడుతున్నారు. నగరంలో ఉల్లి ధర రోజురోజుకు పెరుగుతోంది. మహారాష్ట్ర నుంచి దిగుబడి అయ్యేటటువంటి ఉల్లి ధర దాని ఘాటు మలక్‌పేట్ ఉల్లి మార్కెట్లు తగులుతుంది. సామాన్య ప్రజలు ఉల్లిగడ్డను కొనాలంటేనే జంకుతున్నారు. దీంతో ఉల్లి ధర పెరగడంతో మార్కెట్ యజమానులు సంతోషపడగా.. సామాన్యులు మాత్రం ఉల్లి కన్నీరు పెట్టిస్తోంది అంటున్నారు. మొన్నటి వరకు టమాటా ధరలకు అల్లాడిన జనం ఇప్పుడు ఉల్లి కొనాలంటే భయపడుతున్నారు. ధరలు పెరిగే కొద్ది నిత్యవసర వస్తువుల ధరలు కూడ పెరుగుతున్నాయి. దీంతో సామాన్యుడు కొనలేనటువంటి పరిస్థితి. తాజాగా ఉల్లి ధరలు 30 శాతం వరకు ధర పెరగడంతో కొనేందుకు అల్లాడుతున్నారు జనం. వారం పది రోజుల క్రితం వరకూ రోజుకు 100 నుంచి 130 లారీల ఉల్లి మార్కెట్‌కు వచ్చేది. కానీ ప్రస్తుతం 50 నుంచి 60 లారీలు మించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కోడ్ సమీపించిన వేళ ఉల్లి ధుర పెరగడంతో భారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పైపడే అవకాశం ఉందా అంటే అఅవును అనే సమాధానం వినిపిస్తోంది.

## అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం: గోషామహల్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఈచిత్రంలో మాజీ కార్పొరేటర్లు పి.మమతసంతోష్‌గుప్త, శాంతిదేవిలు

గోషామహల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: గోషామహల్ నియోజక వర్గం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిఆర్‌ఎస్ అధిష్టానం ఎవరు పేరును ఖరారు చేయలేదని గోషామహల్ నియోజక వర్గం మాజీశాసనసభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్, మాజీ కార్పొరేటర్లు పి.మమతసంతోష్ గుప్త, పరమేశ్వరిసింగ్, రామచంద్రరాజు, ఆలపురుషోత్తం, శాంతిదేవిలు ఉద్యమనాయకులు నాయకులు, వెల్లడించారు. ఈ మేరకు ఆదర్శనగర్‌లోని మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త కార్యాలయంలో ఏర్పాటు చేసిన, బిఆర్‌ఎస్, ఉద్యమనాయకులు, ముఖ్య నాయకులు సమావేశ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ శాసన సభ్యులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, బిఆర్‌ఎస్ నాయ కులు పి.సంతోష్ గుప్త, రమేష్‌గుప్త, బెజ్జిని శ్రీనివాస్ కురుమలతో కలిసి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అధిష్టానం ఎటువంటి పార్టీ టిక్కెట్ ఇస్తానని హామీలు ఇవ్వదని, పార్టీ సిద్ధాంతాలు నచ్చి చేరిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, చెబుతుందని అన్నారు. అధిష్టానం ప్రకటన లేకుండానే ఈ మధ్య కాలంలో ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌బిలాల్ గోషామహల్ నియోజక వర్గానికి కాబోయే ఎమ్మెల్యే నంటూ నిత్యం ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ఎవరిని కలుపుకోని పోవడంలేదన్నారు. ఇవేవి చేయకుండా మీడియాల్లో నిత్యం కనపడి తనకు తాను ఒక లీడర్‌గా భావించుకోవడం మానుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, బిఆర్‌ఎస్ కార్యానిర్వాహక కమిటి అధ్యక్షులు, మంత్రి కెటిఆర్ గోషామహల్ నియోజకర్గం బిఆర్‌ఎస్ మాజీశాస నసభ్యులు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమనాయకులు, నాయకులు, కార్యకర్తలకు సమయం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు సతీష్‌గౌడ్, సురేష్ పాల్గొన్నారు.

## 31న విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జె.బి.రాజు, మాస్టార్జీ తదితరులు

సైఫాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త: విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవం గద్దరన్న నివాళిగా 45 పాటల బహుజన స్వరార్చన కార్యక్రమం ఈ నెల 31వ తేదీన రవీంద్రభారతిలో జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రముఖ అంబేద్కర్ వాది, సీనియర్ జర్నలిస్టు జె.బి.రాజు, టివైఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రాజు, కళామండలి వ్యవస్థాపకుడు మాస్టార్జీ తదితరులు దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 31వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు వార్షికోత్సవం జరుగుతుందన్నారు. ఇందులో విశిష్ట అతిధులుగా మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు, రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ వి.ఈశ్వరయ్య, కొలకలూరి ఇనాక్, బుర్రా గోవర్ధన్, చిక్కా రామదాసు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు. మాస్టార్జీ రాసిన 45 పాటల్ని 45 మంది గాయనీగాయకులకు 45 మంది ప్రముఖులకు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు విరాహత్‌ఆలీ, ఇంద్రవెల్లి రమేష్, అందె భాస్కర్, కోలా జనార్ధన్, అమృత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బిసి కులగణన చేపడతామని ప్రకటించాలి

**కాంగ్రెస్ పార్టీ బిసిలకు 60 సీట్లు కేటాయించాలి: జాజుల డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త: దసరా పండుగలోపు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో బిసి కులగణన చేపడతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యేకంగా కార్యచరణ రూపొందించి బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేపడతామని హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మేజారిటీ ప్రజల ఓట్లు, సీట్ల కోసం సిఎం కెసిఆర్ రాయితీలు, తాయిలాలు ప్రకటించి గద్దెనెక్కేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనార్టి ప్రజల ఆకాంక్షలను కెసిఆర్ పరిగణంలోకి తీసుకోవడం లేదని కేవలం గద్దెను ఎక్కుదాము, దోపిడీ చెద్దామనే యావలో ఉన్నారని ఆరోపించారు. బీహార్‌తోపాటు ఆరు రాష్ట్రాలలో బిసిల కులగణను ప్రభుత్వాలు చేపడుతున్నాయని, కెసిఆర్ టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా ప్రకటించి కులగణన చేపడతామని ఎన్నికల ప్రచారంలో ఆరేడు సభలు పెట్టినా ఏ ఒక్క సభలో కూడా కులగణనపై ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రధాని నరేంద్రమోదీని చట్టసభలలో బిసి బిల్లుపెట్టాలని కెసిఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత కూడా మహిళా బిల్లులో ఓబిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని లేఖలు రాశారే తప్పా, రాష్ట్రంలో బిసిల కులగణన చేపడతామని ప్రకటించడం లేదని ఆయన విమర్శించారు. ఆదే విధంగా కాంగ్రెస్ పార్టీ రెడ్లు, అగ్రకులాల పార్టీగా మారిందని, ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో అగ్రవర్ణాలకే ఎక్కువగా ప్రాధాన్యత కల్పించిందని ఆరోపించారు. గెలవలేని పాత నగరంలో బిసిలకు సీట్లు కేటాయించిందని, ప్రజాస్వామ్య పార్టీని గొప్పలు చెప్పుకుంటున్నదని ధ్వజమెత్తారు. ఉదయ్‌పూర్ తీర్మానాలను పక్కనపెట్టి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కుటుంబంలో రెండు సీట్లు, మైనంపల్లి హనుమంతరావు ఇంట్లో రెండు సీట్లు కేటాయించిందని ఆయన విమర్శించారు. రెండోవ జాబితాలో కాంగ్రెస్ పార్టీ బిసిలకు 60 సీట్లు కేటాయించాలని, బిసి అభ్యర్థినే ముఖ్యమంత్రిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీని బోందపెడతామని జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

## బిజెపి అధికారంలోకి వస్తే సమస్యలు సత్వర పరిష్కారం



స్థానికులతో సమస్యలపై మాట్లాడుతున్న రవీంద్రరావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీంద్రరావు పేర్కొన్నారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు లంగటి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీంద్రరావు మార్పు కోసం బిజెపి అనే నినాదంతో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి కరపత్రాలు అందిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ అక్కడ నుండే అధికారులకు ఫోన్ల ద్వారా అక్కడికక్కడే ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు కుమార్ యాదవ్, నరసింహారెడ్డి, కుమారచారి, పీవీ సుబ్బారావు, ఆర్కేచారి, నీలాంబరరావు, రమణబాబు, రవీందర్, ఉదయ్ భాస్కర్, వీరస్వామి, విక్రమ్, జీవన్, దుర్గ, సాయికృష్ణ, రాములు, గంగాధర్, అనిల్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల డివిజన్ 132 కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామ

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు సూదుల సంపత్‌గౌడ్ బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి అలాగే 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్ష పదవికి బుధవారం రాజీనామ చేసి, టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడిగా గత 3 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా గత 20 సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించి నావంతు పాత్ర పోషించానని, గత కొద్దిరోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలతో కలతచెంది నా ప్రాథమిక సభ్యత్వానికి 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నాని తెలిపారు. పార్టీలో ఉన్నన్ని రోజులు నాకు సహకరించిన మిత్రులకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్.వినగర్‌లో అమ్మవారి ప్రతిమ ఏర్పాటు



అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 18ప్రభాతవార్త: దేవిశరన్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పురా నాపూల్ స్వామి వివేకన నందనగర్ అమ్మవారి ద్వారం వద్ద మహేష్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు.నగరంలోని పలు దేవాలయాలు ఏ వీధి చూసినా ఏవాడ చూసిన అమ్మవారి పాటలు,పూజల కళకళలాడుతున్నాయి.పరిసర ప్రాంతాలు అధ్యాత్మిక ప్రభావం కనిపిస్తున్నాయి. దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను ప్రజలు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్నారు.పురానాపూల్ స్వామి వివేక నందనగర్ కనకదుర్గ దేవాలయంలో ఉదయం,రాత్రి వేళ్లలో ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ అమ్మవారికి కుంకమార్చన పూజలను చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణి చేస్తున్నారు.మహేష్ యూత్ ప్రతినిధులు ఆకాష్,సుధీర్,కిరణ్, శ్రీనివాస్,విద్యాసాగర్,సతీష్,నవీన్,నాని తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో మళ్లీ డ్రగ్స్ దందా

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 18, ప్రభాతవార్త: హైదరాబాద్ సిటీలో మళ్ళీ డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. సిటీలో మరోసారి చాపకింద నీరులా విస్తరిస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు కేత్లాపూర్ బ్రిడ్జీ వద్ద ఎక్సైజ్ విభాగం ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై అనుమానస్పదంగా కనిపించడంతో వారి వద్ద తనిఖీ చేయగా డ్రగ్స్ బయటపడిందన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కాకినాడకు చెందిన ఉమ్మిడి ఇమ్మానియల్ (23), కొడులూరి మోహన్ (25) వీరిద్దరు నగరంలో ఎండిఎంఎ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద పట్టుబడిన రూ. 2లక్షల 50వేల విలువ చేసే డ్రగ్స్‌తో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## వాటర్ బోర్డులో 4వేల మందికి

# కార్మికులకు పెరిగిన వేతనాలు

చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త: కార్మిక, ఉద్యోగ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో సిఎం కెటిఆర్, మంత్రి కెటిఆర్‌లు ముందుంటారని రాష్ట్ర కనీసవేతన సలహామండలి చైర్మన్ పి.నారాయణ అన్నారు. వాటర్‌బోర్డులో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చాలీచాలని వేతనాలతో కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారని, 14,60 జీవో అమలు చేయడంలో గత రెండు నెలల నుంచి 4వేల మందికి కార్మికులకు పెంచిన వేతనాలు రావడంతో వారు సంతోషంగా ఉన్నారన్నారు. బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయం ఆవరణలోఉన్న కనీస వేతన సలహామండలి ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌ను వాటర్‌వర్క్స్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(బిఆర్‌టియు అనుబంధం) ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కలిసి నారాయణను ఘనంగా సత్కరించారు. వేతనాలు పెరగడంతో కార్మికులందరు సంతోషంగా ఉన్నారని కిరణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో యూనియన్ న ఆయకులు బాలరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, బాలకృష్ణరెడ్డి, నరేశ్, రవిబాబు, కుమార్, మూర్తి, బాలరాజ్, నరేందర్, కమలాకర్, అనీల్, మహేష్‌రెడ్డి, హరీశ్, రవి తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాజేశ్వరరావు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పోరేటర్ దీపిక

## దుర్గామాత అండదండలతో సంతోషంగా ఉండాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరావు**

**కూకట్‌పల్లి..** దుర్గామాత కృపా కటాక్షాలతో కూకట్‌పల్లి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బిజెపి కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్‌లోని శ్రీ వీర హనుమాన్ యూత్ అసోసియేషన్, వినాయక నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన భవాని మాత మండపాలను బుధవారం వద్దేపల్లి రాజేశ్వరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. మాత దయతో ప్రజల అండతో బిజెపి పార్టీ విజయం సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బల్కాజగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హారీష్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ డాక్టర్ కిరణ్, డివిజన్ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శివరంజని, బస్వరాజు, చందు, శ్రీనివాస్, అనిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న కార్పోరేటర్ కొంతం దీపిక**

**సంజీవరెడ్డి నగర్..** సేవా భాయ్ సేవా సంఘం నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 27వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 3వ రోజు అన్నపూర్ణాదేవి అలంకరణలోని అమ్మవారిని మోండా మార్కెట్ డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, నరేష్ కుమార్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, దిశ కమిటీ సభ్యులు పి.చరణ్‌సింగ్, బిజెపి సీనియర్ నాయకులు ఎచన్ సురేష్, రాజ్‌కుమార్ జాదవ్, జతిన్ జాదవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం**



**సికింద్రాబాద్** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా సీతాఫల్‌మండి డివిజన్‌లో అమ్మవారి పూజా కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బీఆం ఎస్ నాయకుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీదుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యాక్రమాన్ని బండ కార్తీకరెడ్డి ప్రారంభించారు.

# ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాము

**రాజేంద్రనగర్ ఆర్.ఓ మల్లయ్య.. వాహనాల తనిఖీలో రూ.కోటి పట్టుకున్నాము : గంగాధర్**



నార్సింగి, అక్టోబర్ 18 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, ఓటర్లు స్వేచ్ఛగా ఓట్లు వేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్.ఓ మల్లయ్య పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు పకడ్బంధీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 18.ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, మన పాలకులను మనమే ఎన్నుకునే అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ఓటు నమోదు చేసుకోని వారుంటే, ఏదేని కారణాలతో గతంలో ఉన్న ఓటు రద్దయి ఉంటే ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ఆర్.ఓ మల్లయ్య తెలిపారు. అసెంబ్లీ పరిధిలో మొత్తం 535.పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, మరో పది పెరిగే అవకాశం ఉందన్నారు. బిఎల్‌ఓలు, ఇతర శాఖల అధికారులంతా గ్రామాలు, కాలనీలు, బస్తీలలోకి వెళ్లి విరివిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలలో అవగాహన కల్పించారన్నారు. ఈ సారి తీవ్ర అనారోగ్యంతో నడు వలేని వారుంటే, 80.ఏళ్ల వయసు పైబడ్డ వారుంటే ఇంటికే వెళ్లి ఓటు వేయించే ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందన్నారు. అయితే ఈ అవకాశం లభించాలంటే సదరు వ్యక్తులు ముందుగానే "12.డి" ఫారంను పూరించి ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో 56.శాతం పోలింగ్ జరిగిందని, ఈ సారి మరింత పెంచేందుకు శక్తివంచన లేకుండా కష్టపడుతున్నామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొత్తం 5,53,590 ఓట్లున్నాయని, 2,64,674మంది మహిళలు, 2,88,877 పురుషులు, 39.మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. 18-19 సంవత్సరాల వయసు వారు 1.93.శాతం, 20-29.వయసున్న వారు 17.18శాతం, 30-39 వయసున్న వారు 32.97శాతం, 40-49 వయసున్న వారు 23.16.శాతం, 50-59 వయసున్న వారు 13.17శాతం, 60-69 మధ్య వయసున్న వారు 7.35శాతం, 100.ఏళ్ల వయసున్న వారు 0.01 మంది ఉన్నారని ఆర్.ఓ మల్లయ్య వివరించారు. అనంతరం నోడల్ ఆఫీసర్ గంగాధర్ మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఒక్కరి వద్ద రూ.50.వేల కన్నా అధికంగా ఉంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి తెచ్చారు? సంబంధిత రిసిప్టులు చూపించాలన్నారు.



ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన మైనార్టీలు

## మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 18 ప్రభాతవార్త : మైనార్టీల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.నియోజకవర్గంలోని సులేమాన్ నగర్,నౌనెంబర్,ఎంఎం పహాడి ప్రాంతాలకు చెందిన మైనార్టీ యువకులు బుధవారం మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి మైనార్టీలు బిఆర్ఎస్‌లో చేరారని తెలిపారు.మహ్మద్ ఇస్మాయిల్,మహ్మద్ అక్బర్,జీషాన్,ఎండి తాయార్,మహ్మద్ రవూఫ్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసిన చార్మినార్ కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతి



చార్మినార్,అక్టోబరు 18 ప్రభాతవార్త : కాంగ్రెస్ బస్సు యాత్రలో పాల్గొనటానికి రాష్ట్రానికి విచ్చేసిన కాంగ్రెస్ అగ్రనేత,ఎంపి రాహుల్ గాంధీని పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు కలిశారు.కాంగ్రెస్ నాయకులు,ప్రముఖ వ్యాపార వేత్త అలీ మస్కతితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఎయిర్ పోర్టులో కలిసి సన్మానించారు.పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సభకు బయలుదేరిన గులాబీ సైన్యం



కొంపల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త : మేడ్చల్‌లో జరుగనున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజాశీర్వాద సభకు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఆధ్వర్యంలో వందలాదిగా గులాబీ సైన్యం బయలుదేరింది. కొంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి 500 కార్లు, బైకులతో భారీగా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా బయలుదేరారు.

## నేడు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్న మంత్రి

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేడు ఉదయం 8:30 గంటలకు మోండా మార్కెట్ డివిజన్ బండిమెంట్ నుండి పాదయాత్ర ద్వారా తన ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌ల నుండి వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బండిమెర్, మారుతివీధి, నాలా బజార్, ఓల్డ్‌జైల్ ఖానాలలో ప్రచారం నిర్వహిస్తారు. అదేవిధంగా శుక్రవారం ఉదయం అమీర్‌పేట డివిజన్ బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, సుప్రభాత్‌నగర్, రేణుక నగర్, బిజెఆర్ నగర్ 1, శ్రీరాంనగర్, 21వ తేదీ శనివారం బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కష్టమ్ బస్తీ, బ్రాహ్మణవాడి, వడ్డేర బస్తీలలో, 22వ తేదీ ఆదివారం ఉదయం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని డిఎస్‌ఎం కాలనీ, అశోక్‌కాలనీ, ఎస్పార్టీ క్వార్టర్స్, 25వ తేదీన రాంగోపాల్‌పేట డివిజన్‌లోని మంజు థియేటర్, ఆవులమంద, బర్ధన్‌కాంపౌండ్, కళాసిగూడ, కండోజీ బజార్, నాగన్న దేవిడి, 26వ తేదీన బన్సీలాల్‌పేట డివిజన్‌లోని గొల్ల కొమరయ్య కాలనీ, గాంధీ నగర్, రామస్వామి కాంపౌండ్, బర్కల్ బస్తీలలో, 27వ తేదీన పద్మారావు నగర్‌లోని నాగదేవత టెంపుల్, చిలకలగూడ, ఈశ్వరమ్మ లైన్, బలరాం కాంపౌండ్, సప్తగిరి అపార్ట్‌మెంట్, హమాలీ బస్తీలలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

## ఓబిసి అధికార ప్రతినిధిగా మురళి నియామకం



మురళికి నియామకపత్రాన్ని అందజేస్తున్న జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త: నల్లకుంట డివిజన్‌కు చెందిన మురళిని రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధిగా రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమిం చారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ మురళికి కిషన్ రెడ్డి నియామకప త్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ కార్పోరేటర్ అమృత, అంబర్‌పేట కన్వీనర్ శ్యామ్‌రాజ్, నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, పాతకోటి మహేష్, సురేష్‌యాదవ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన కిషన్‌రెడ్డి, ఆలె భాస్కర్, బిజెపి నగర అధ్యక్షుడు డా.గౌతంరావు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం ఫీవర్ హాస్పటల్ చౌరస్తాలో బుధవారం జరిగిన బతుకమ్మ సంబరాల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి కాలేరు పద్మావెంకటేష్, కుమార్తె డా. దీప్తి పటేల్, కార్పోరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రజలతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఒక్కచోట చేర్చి ఆడబిడ్డలతోపాటు బతుకమ్మ సంబరాల్లో పాల్గోనడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్స్‌లో 12రోజుల ఎక్స్‌పో



హునార్ మహోత్సవ్ లో ఆకర్షిస్తున్న కళాఖండాలు

బేగంపేట అక్టోబరు 18,ప్రభాతవార్త : కళాకారులు, చేతివృత్తుల వారి కోసం ఒక వేదికను అందించి వారిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతోపాటు అరుదైన కళలను రక్షించడానికి సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో హునార్ మహోత్సవ్ పేరుతో కళాత్మక వస్తువులు, వంటకాల పండుగ వేడుక ప్రారంభమైంది.ఈ మహోత్సవ్ లో 25 కంటే ఎక్కువ రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 300మంది కళాకారులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్,అస్సాం.బీహార్,ఢిల్లీ,గుజరాత్,హర్యానా, హిమాచల్ ప్రదేశ్,జమ్మూకాశ్మీర్,జార్ఖండ్, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్,రాజస్థాన్, తెలంగాణా, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్,పశ్చిమబెంగాల్,తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పాల్గొంటున్నారు.ఈ మహోత్సవ్‌లో ఆప్లిక్ వర్క్,డ్రైఫ్లవర్స్,జూట్ కేన్,ఇత్తడి ఉత్పత్తులు, మట్టి బొమ్మలు, అజ్రఖ్ బ్లాక్ ప్రింట్,తదితర ఉత్పత్తులు సాంప్రదాయ వంటకాలను కూడా ఆస్వాదించవచ్చు.ఈ మహోత్సవ్ కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తి సంగీత సంగీతవిభావరి



గానం చేస్తున్న ఎంవి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి

చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త: కళియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో దసరా సందర్భంగా రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వరనయంలో భక్తి సంగీత విభావరి కార్యక్రమంలో ప్రముఖ గాయనీమణులు ఎం.వి. రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిభావంతో అన్నమాచార్యుల వారి కీర్తనలను గాయనీమణులు ఎంవి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి, శాంతకుమారి, కనక కామేశ్వరి, లలితావాణి, కమల తదితరులు 'ఏమని పొగడుదుమే', 'గోవింద గోవింద అని కొలువరే', 'మనసావాచా', 'మాధవాకేశవా', 'ముద్దుగారే యశోద', పిడికిట తలంబ్రాలు పెళ్ళికూతురు', వినరో భాగ్యము విష్ణు కథ', 'హరినామముకడు ఆనందకరము', 'ఇందరికీ అభయంబు నిచ్చుచే' వంటి అద్భుతంగా భక్తిగానం చేయడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికసాగరంలో తేలియాడించింది. కీబోర్డుపై శ్రీనివాస్, తబలాపై వెంటాచారి వాద్యసహకారాన్ని అందించారు.

## ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థుల ప్రకటన



ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్దులను ప్రకటించిన జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

గోషామహల్, అక్టోబర్ 18ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ మాసంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బరిలో ఉండే ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్దులను ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ప్రకటించారు. బుధవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో 15మంది ప్రజా ఏక్తా అభ్యర్దుల జాబితాను వెల్లడించారు.దుబ్బాక నరేష్‌దూత్‌పాల, మెదక్ బత్తుల దిలిప్,ముషీరాబాద్ సాంబ రవీంద్రనాథ్, కార్వాన్ వి.నర్సింగ్‌రావు,గోషామహల్ బోనాల శ్రీనివాస్‌గుప్త,ఎల్‌బినగర్ నరేష్‌గౌడ్, భువనగిరి ముఖేష్‌మేరు,కుత్బుల్లాపూర్ పద్మజా గడ్డం, ఉప్పల్‌కు ధర్మేందర్ తివారి,నల్గొండకు రమేష్, నాగర్‌కర్నూల్‌కు బి.వెంకటయ్య, సనత్‌నగర్ సర్దార్ గురదయాల్‌సింగ్, రాజేంద్రనగర్ ఓంప్రకాష్‌శర్మ, చంద్రాయణగుట్టకు బి.దీపిక,మహబూబ్‌నగర్ ఇప్పటి అంజనేయులను ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్దులుగా పోటి చేస్తారని తెలిపారు.పార్టీ గుర్తు ప్రేషర్‌గుర్తు తెలిపారు.

## గాంధీనగర్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోప్రతి ఏటా స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే బతుకమ్మ సంబురాలు కార్యక్రమాన్ని 21న నిర్వహించబోతున్నారు. బుధవారం కార్పొరేటర్ కార్యాలయంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో పాటు సీనియర్ బిజెపి నేతలు శ్రీకాంత్,వివిస్టీ రాజు, ఉమేశ్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, బాలకృష్ణ, ప్రకాశ్‌యాదవ్, సురేశ్, తులసీ, సంయుక్త రాణి, బిజెపి, బిజెవైఎం ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త: మన సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకలుగా నిలుస్తాయని ప్రముఖ విద్యావేత్త, న్యూ ఎరా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని న్యూ ఎరా కళాశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శ్రావణ్‌కుమార్ హాజరై విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో పాటు కోలాటం ఆడారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగలు నిలుస్తాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రభుత్వం మన పండుగలను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. మన సంస్కృతిని, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో సనత్‌నగర్‌లో ఎగిరేది గులాబి జెండాయే



పద్మారావునగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

సికింద్రాబాద్, అక్టోబర్ 18 ప్రభాత వార్త: పది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలే మూడో సారి తిరిగి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కడతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బుదవారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధి లోని పద్మారావునగర్ పార్క్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గంలోనే మొట్టమొదటి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి తలసాని ప్రారంభించారు. ముందుగా పద్మారావునగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇక్కడి నుండి పార్టీ కార్యాలయం వరకు పార్టీ నేతలు, కార్యాకర్తలు భారీ బైక్‌ర్యాలీతో మంత్రికి స్వాగతం పలికారు. ఇక్కడ పార్టీ పతాకాన్ని తలసాని ఆవిష్కరించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో చేశామన్నారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు, నేతలు ఏసూరి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, రమణ, శైలేందర్ మిట్టపల్లి బాబురావు, సురేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ నగర్ డివిజన్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే



బిజెపికి మద్దతు తెలపాలని కోరుతున్న శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధి లోని అపురూపకాలనీ, ఎస్ఆర్ నాయక్ నగర్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చి, తనను గెలిపించాలని కోరారు. రెండుసార్లు కెపి వివేకానంద్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే దొంగ హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, ఈసారి అతనికి బుద్ధి చెప్పాలని కోరారు. తనను గెలిపిస్తే కాలనీలలోని సమస్యలను పరిష్కరించి అత్యాధునిక మౌలిక సౌకర్యాలు కల్పిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎమ్మెస్ వాసు, కంది శ్రీరాములు, గుబ్బల లక్ష్మీనారాయణ, మల్లేష్‌గౌడ్, బొబ్బ ప్రసాద్, కుమ్మరి శంకర్, అడబాల వెంకటరత్నం, రమణ, విగ్నేష్, అనుక్, మాలాద్రి, భీమరాజు, శ్రీనివాస్‌గుప్తా, చంద్రశేఖర్, వల్లూరి ప్రసాద్, కులకర్ణి, బాబుగౌడ్, కాలనీ వాసులు తిప్పారెడ్డి, గణేశన్ పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నేతల నిరసన



లంగర్‌హౌస్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

మెహిదీపట్నం, అక్టోబర్ 18, ప్రభాతవార్త : కార్వాన్‌లో కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి ఉస్మాన్‌బిన్ అల్ హజ్రీని మార్చాలని కోరుతూ గత రెండు రోజులుగా కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ నేతలు బుధవారం లంగర్‌హౌస్‌లోని గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్లబ్యాడ్జీలను కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్వాన్ ఏ-బ్లాక్ అధ్యక్షులు కూరాకుల కృష్ణ మాట్లాడుతూ..పార్టీ కార్యక్రమాలలో ఏనాడు పాల్గొని పాల్గొని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త అతని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని, అతనికి నియోజకవర్గ కార్యకర్తల మద్దతు లేదన్నారు. కేవలం అతను పైరవీ చేసుకొని టికెట్ తీసుకున్నారని ఆరోపించారు. ఉస్మాన్‌బిన్‌ను మార్చి ఎన్నో సంవత్సరాలుగా పార్టీని నమ్ముకొని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోతూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో నాయకులు చంటిబాబు, చంద్రశేఖర్, ముంగి రఘుపాల్‌రెడ్డి, గిరి, రామ్‌కుమార్, శేశకల, వనజ, కిషన్, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డిలు ఉన్నార

## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్ యాదవ్

కూకట్‌పల్లి, అక్టోబర్ 18, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ సునీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్స్, కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కమిటీ సభ్యులతో రాబోయే సార్వత్రిక ఎన్నికల గురించి బూత్‌స్థాయి కమిటీ నిర్వహణ సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నేషనల్ జాయింట్ సెక్రటరీ చరిత కొనకల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నేటి నుంచి ప్రజల్లోకి తీసుకువెళతామని డివిజన్‌లో ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవకర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్స్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు సన్మానం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త: రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్‌రెడ్డి మనుమడు జనంపల్లి అరుష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం కాలనీలో కేక్ కట్ చేసి మీడియా సోదరులకు సుమారు 15మందికి మెమొంటోలు అందజేసి, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీడియా సోదరులు చిరంజీవి ఆరుష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రరావు, తాండవ కృష్ణప్రసాద్, శ్రీధర్, సూర్యనారాయణ, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, నారాయణరెడ్డి, రాఘవేందర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, యూత్ కమిటీ సభ్యులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమానిన విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మీడియా మిత్రులకు కమిటీ సభ్యులకు కాలనీవాసులకు పేరుపేరునా అభినందలను పురేందర్‌రెడ్డి తెలియజేశారు.

## అంబర్‌పేటలో చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుంది



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్ అక్టోబరు 19 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి తనను గెలిపిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో ఎన్నికల ప్రచార పాదయాత్ర రెహ్మాత్‌నగర్ నుంచి వినాయక నగర్ చౌరస్తా వరకు స్థానిక కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం సాగింది. ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో అభివృద్ధి గురించి తెలిపి, రేపు అమలు చేయబోయే మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సిఎం కెసిఆర్ నేతృత్వంలో అంబర్‌పేటను కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కంటోన్మెంట్ సీటు మాదిగలకు కెటాయించాలి : దేవుడు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత దేవుడు

కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులకు సముచిత స్థానం కల్పించడం లేదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డి.బి.దేవేందర్ (దేవుడు) మండి పడ్డారు. పికెట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ అయినందు వల్ల స్థానికులకు ఆయా పార్టీల నుంచి టికెట్లు కెటాయించకుండా స్థానికేతరులకు టికెట్లు కెటాయించడం సరైందికాదన్నారు. అటు వంటి వ్యక్తులకు టికెట్లు కెటాయిస్తే గెలిచిన, ఓడిన పత్తాలేకుండా పోతారన్నారు. ఈ ఎన్నికల్లో స్థానికేతరులకు టికెట్లు కెటాయిస్తే ఇతర పార్టీల నుంచి తాను టికెట్ తెచ్చుకొని కంటోన్మెంట్‌లో విజయం సాధిస్తామన్నారు.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో సంబరాలు



హన్మంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

నిజాంపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొలన్ హన్మంత్ రెడ్డికి పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం నియోజకవర్గంలోని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హన్మంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు తమ పూర్తి మద్దతు ఉంటుందని వాగ్ధానాలు చేస్తున్నారు. అదే సమయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఇతర పార్టీల నేతలు సైతం కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి కొలన్ హన్మంత్‌రెడ్డి బరిలో నిలవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు పార్టీ నాయకులు, కార్యకర్తలు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే కొలన్ హన్మంత్‌రెడ్డికే తమ పూర్తి మద్దతు ఉంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అన్ని వార్గ్‌ల ప్రజలు మద్దతు తెలుపుతుండటం కాంగ్రెస్ పార్టీలో మరింత జోష్‌ను పెంచుతోంది.

### సురారం కాలనీ రాజీవ్ గృహకల్పలో పాదయాత్ర

జీడిమెట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త : సురారం కాలనీ రాజీవ్‌గృహకల్ప అధ్యక్షుడు శివగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాదయాత్ర చేస్తూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ రాజు సహకారంతో సుమారు 3.5కోట్లతో డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయించామని అందులో భాగంగానే పనులు జరుగుతున్నాయని అన్నారు. త్వరలోనే రాజీవ్ గృహకల్పలో పూర్తి స్థాయిలో డ్రైనేజీ లైన్‌లను పూర్తి చేయిస్తామని అన్నారు. స్ట్రీట్‌లైట్ రావడంలేదని స్థానికులు చెప్పగా వెంటనే లైట్లను రిపేర్ చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వేణు, ధనంజయుడు, లక్ష్మణ, రాజు, రాజీ, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## లలితాదేవి అలంకారంతో అమ్మవారం



చిక్కడపల్లి, అక్టోబరు 18 ప్రభాతవార్త: శ్రీదేవి శరన్నవరాత్రోత్సవా లను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో నేతాజి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు లలితాదేవి అలంకారంతో మంటపం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మబంధు, కల్యానం దపీఠం పీఠాధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆచార్య డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ వారి శిష్యబృందం నాగరాజుశర్మ, సాయినాథశర్మ పర్య వేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, నిర్వాహ కులు పలుస బాల్‌రాజ్‌గౌడ్, కందూరి కృష్ణ, వందన రాజగోపాల్, వికాస్‌చంద్‌జైన్, వలభ్ జైన్, పి.హరీష్‌గుప్త, అనీల్‌కుమార్, శరత్‌గుప్త, డి.చంద్రమో హన్, పి.శివకృష్ణ, పి.చందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గురువారం అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంతో దర్శనమిస్తారు.

## ఈటెలను కలిసిన బిజెపి నాయకులు

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త : తెలంగాణ బీజెపి ఎన్నికల కమిటీ చైర్మన్, హుజురాబాద్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్‌ను బుధవారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ విజయానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను ఈటెలకు కీర్తిరెడ్డి వివరించారు. బిజెపి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడానికి ఈటెల రాజేందర్ చేసిన పలు సూచనలు తప్పకుండా పరిగణలోకి తీసుకొని, తూచ తప్పకుండా అమలు చేస్తామని కీర్తిరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఈటెల రాజేందర్‌ను శాలువాతో కీర్తిరెడ్డి ఘనంగా సత్కరించారు.

## ఎన్నికలు వచ్చాయని మాయ మాటలు చెప్పడం హాస్యాస్పదం

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త : వృద్ధులకు, వికలాంగులకు కొత్త పెన్షన్ మంజూరు చేయని బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.5016 పెన్షన్ ఇస్తామని మాయ మాటలు చెప్పడం హాస్యాస్పదమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నియోజకవర్గంలోని విట్టల్‌వాడిలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల కార్డును విజయారెడ్డి వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్ని పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో, కనీసం పేద ప్రజలకు ఎన్ని కొత్తరేషన్ కార్డులు మంజూరు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల వచ్చాయని ఓట్ల కోసం మరొకసారి ప్రజలను మోసం చేయడానికి హామీలన్నీ ఇస్తున్నారని, పేదలందరికీ కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరిగిందని విజయారెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతకు ఎనలేనిస్ఫూర్తి భారతరత్న డా. ఎపిజె.అబ్దుల్‌కలాం

**తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండాప్రకాష్**



అవార్డు గ్రహీతలతో బండాప్రకాష్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ, మల్లికార్జునరావు, రాఘవ తదితర అతిథులు

రవీంద్రభారతి, అక్టోబరు 18 ప్రభాతవార్త : శాస్త్ర సాంకేతికరంగ నిపుణతని వైద్యరంగానికి అప్లైచేయించి గుండెజబ్బుల నివారణకు వాడే స్టంట్‌ను సమాజశ్రేయస్సు కోసం తక్కువ ధరలో అందించడం అబ్దుల్‌కలాంకే సాధ్యమైందని, అతిసామాన్యుడి నుండి అత్యున్నత రాష్ట్రపతికి ఎదిగినా పదవీవిరమణాంతరం తనకెంతో ఇష్టమైన ఉపాధ్యాయవృత్తితో యువతకు జీవిత చివరాంకం వరకు అందించిన ఆయన యువతతోపాటు ప్రతీఒక్కరికీ స్ఫూర్తి అని కొనియాడారు. వకుళాభరణం మాట్లాడుతూ మనిషి మట్టిమీద పడితే జననం, మట్టి మనమీద పడితే మరణమని, కోటానుకోట్లు సంపాదించినా మనతోనే అంతమౌతుంది కానీ అబ్బుల్‌కలాం లాగా సంపాదించిన సమాజ, యువత అభ్యున్నతి కృషి, గొప్పపేరు ప్రఖ్యాతులనే సంపద కలకాలం అందరి హృదయాల్లో నిలిచేవుంటుందని, మనిషున్నప్పుడు పొందిన కీర్తికే శేషముంటుందని, వారే కీర్తిశేషులని, అబ్దుల్‌కలాం కీర్తిశేషులని స్పష్టం చేశారు. ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ మెగాసిటీ నవకళావేదిక ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన భారతదేశ పూర్వ రాష్ట్రపతి భారతరత్న డా. ఎపిజె అబ్దుల్‌కలాం 92వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావులు విశిష్ట అతిథులు అశీష్ చౌహాన్, కె.ఈశ్వర ఆచారి, డా. ఎ.వి.స్వామి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జునరావు, కార్యవర్గ కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి విభిన్నరంగాల్లో విశేష ప్రతిష్టపొందిన 27మంది ప్రముఖులను ఘనంగా సత్కరించి ఎపిజె అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ అవార్డ్స్ 2023 ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

## అభ్యర్థి గెలుపులో పోలింగ్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం

**మంత్రి తలసాని**



సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పోలింగ్ ఏజెంట్ల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: ఎన్నికల ప్రక్రియ అభ్యర్థి గెలుపులో పోలింగ్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమైందని సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి,రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం మారేడ్‌పల్లి పద్మశాలి కళ్యాణ మండపం లో నిర్వహించిన సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోలింగ్ ఏజెంట్లు వారి వారి బూత్‌లలోని ఓటర్ల ఇండ్లకు వెళ్లి వారితో కలిసి ప్రతి ఒక్కరు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన టెక్నాలోజీతో ఉపయోగించిన ఓటర్ లిస్టుల యాప్‌ను అన్ని బూత్‌లలో ఎన్నికల రోజున ఓటర్ లిస్టులో పేరుతో లేక పోతే అందోళనకు గురి కావడం జరుగుతుందన్నారు. అలా కాకుండా ముందుగానే ఓటర్ల జాబితాలో పేరు ఉందా లేదా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కొలను లక్ష్మి బాల్ రెడ్డి, హేమలత, మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు ఆకులరూప, శేషుకుమారి, కిరణ్మయి, డివిజన్ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, హన్మంత్ రావ్, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణలతో పాటు 229 పోలింగ్ బూత్‌లకు చెందిన పోలింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలే గెలిపిస్తాయి: లాస్య నందిత



బొల్లారంలో ఎన్నికల పాదయాత్ర నిర్వహిస్తున్న కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: తెలంగాణలో ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో తనను బారీ మెజార్టీతో గెలిపించాలని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. బుధవారం 8వ వార్డులోని బొల్లారం, రీసాల బజార్ ధర్జీ బస్తీ, జెండా బస్తీ,పెన్ షన్ పుర, యాదవ బస్తీల్లో పర్యటించి ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలను గుర్తు చేస్తూ బిఆర్ఎస్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్,కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు లోకనాథం, బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు నివేదిత, రవి, మురళీ యాదవ్, రంగ రవిందర్ గుప్త, నరిసింహ్మ ముదిరాజ్, పనస సంతోష్, సదా నంద్ గౌడ్, తేజ్‌పాల్, బాస్కర్ ముదిరాజ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సీనియర్ పాత్రికేయులు సముద్రాల జగదీష్ గుప్తాను పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 18, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన సీనియర్ పాత్రికేయులు సముద్రాల జగదీష్ గుప్తాను కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు బుధవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జగదీష్ గుప్తాను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ ఆరోరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోండా మార్కెట్‌లో అన్నదానం

కంటోన్మెంట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని మోండా మార్కెట్‌లోని మహావీర్ జైన్ భవన్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోబిజెపి నాయకులు మాధవి, పద్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో బతుకమ్మ సంబరాలు, పసుపు కుంకుమ, అన్నప్రసాదాలు నిర్వహించారు.

### నేటి నుంచి ఎన్నికల ప్రచారం

కంటోన్మెంట్,అక్టోబర్ 18 ప్రభాతవార్త: సనత్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం మోండా డివిజన్ లోని బండి మెట్టు నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు తెలిపారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, S GAYATHRI D/O M S SANKAR W/O ANAND SUNIL DESHPANDE R/O T026, 10TH BLOCK, OSIAN CHLOROPHYLL APARTMENTS, SERVICE ROAD, OFF BYPASS ROAD, OPP PORUR LAKE, DEVI PARASAKTHI NAGAR, PORUR, TIRUVALLUR, TAMIL NADU 600116, CURRENTLY RESIDING AT G5, GAUTHAMI PARADISE, NEAR MASJID BANDA CIRCLE, BOTANICAL GARDEN ROAD, HYDERABAD, 500084, HAVE CHANGED MY NAME AFTER MARRIAGE TO GAYATHRI ANAND DESHPANDE.
(Ro.No.31820)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.




బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

మూసాపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త : వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కాలేజ్‌లో బుధవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. కాలేజీకి సంబంధించిన అన్ని తరగతుల విద్యార్థులు పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా కోలాటం ఆడారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ చాలా పవిత్రమైన పండగ అని, తెలంగాణ ఆడపడుచులందరినీ బతుకమ్మ తల్లి చల్లగా చూడాలన్నారు. ఈ సంబరాలలో కళాశాల డైరెక్టర్ కెవి లావణ్య, డీన్ మౌనిక, ప్రిన్సిపల్ మీరావాలి, వైస్ ప్రిన్సిపల్ భాగ్య కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబురాలు



ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బుధవారం బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు మహిళా విభాగ ఇంచార్జ్ డా.జి. మేరీ సునంద ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమంలో డా.రజని, డా.రాణి రజిత మాధురి, మంజుల, సులోచన, సుహాసిని, రుశేంద్రమణి, కామాక్షి, విశ్వవిద్యాలయ మహిళలు ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు మహేష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన బిఆర్ఎస్ నాయకుడికి చేయూత



గాయాలకు గురైన నాయకుడిని పరామర్శిస్తున్న పన్నాల దేవేందర్ రెడ్డి

నాచారం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైన బీఆర్ఎస్ నాయకుడు మోహన్‌ను మల్లాపూర్ కార్పోరేటర్ బుధవారం పన్నాల దేవేందర్ రెడ్డి పరామర్శిం చారు. ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి, బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిఎల్ఆర్ ద్వార అందజేసిన రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని మెహన్ కుటుంబానికి కార్పోరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటార్ల భాస్కర్, కుంటి కృష్ణ, బైరపాక ప్రవీణ్, బాసిత్, ఉస్మాన్, శీలం ప్రవీణ్, శేకర్, శ్రీకాంత్, రమేష్ తధితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి మంచిస్పందన : పన్నాల

ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం మల్లాపూర్ డివిజన్‌లో కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి డివిజన్ పరిధిలోని శక్తిసాయినగర్, మల్లికార్జున్ నగర్ తధితర ప్రాంతాల్లో నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన ప్రోచర్లను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE IInd ADDL. SENIOR CIVIL JUDGE: AT: MALKAJGIRI**
**O.S.NO. 960 OF 2022**

Between:
**Sri. Hari Krishna Shambhagari** S/o Shambhagari Vijay Kumar, aged about 25 years, Occ - Business, R/o. H.No. 3-13-124/3A, Chanikyapuri Colony, Mallapur, Nacharam Post, Hyderabad Pin-500076 **...Plaintiff**

AND

1. **M. Suresh** S/o M. Vishwanath, Aged About 51 Years, Occ- Business. Residents of H.No.3-13-100/73, P.No. 76, Babanagar, Mallapur, Medchal-Malkajgiri District 500076.
2. **M. Kusum** W/o M. Suresh, Aged About- 43 years, Occ- House Wife, Residents of H.No.3-13-100/73, P.No. 76, Babanagar, Mallapur, Medchal-Malkajgiri District 500076.
3. **HDB Financial Services Ltd,** House No.1-6-11, First Floor, Sreeram Nagar Colony, Beside Radhika Theatre, ZX Dr As Rao Nagar, ECIL 500062.

**....Defendants**

This notice is for the above said defendant no.1 & 2.
That the above Plaintiffhave filed the above suit for specific performance against the defendants,before this COURT OF THE HON'BLEIIND ADDL. SENIOR CIVIL JUDGE, At Kushiguda, but defendant no.1 & 2 are avoiding to take the notices from the Hon'ble Court and Thereafter this Hon'ble Court has directed for this public publication.
Therefore, the above said defendant no.1 & 2 are hereby informed that if they have got any objection or interest should appear or want to contest in the case have to file the same or appear before the above said Hon'ble Court on **01/11/2023 at 10.30 a.m** through counsel or in person, failing which the matter will decided on merits.

(BY ORDER OF THE COURT)
**MUKESH AGARWAL**
**Advocate**
H.No. LIG-B-86, Dr. A.S.Rao Nagar, ECIL 500062, **Cell: 9100411204.**

## దుర్గామాత సేవలో మంత్రి సబితారెడ్డి



దుర్గామాతకు పూజలు చేసిన మంత్రిని సన్మానిస్తున్న మహిళా కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్స వాల సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం అసెంబ్లీ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో దుర్గామాత మండపాలను సందర్శిం చారు. స్థానిక కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, ఏనుగు రాంరెడ్డిలతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి తదితరులతో కలిసి ఆమె దుర్గామా తలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, ముత్యాల కృష్ణ, రామిడి వీరకర్ణారెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## అనయ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థు ఉ

**వనస్థలిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** హస్తినాపురం డివిజన్‌లోని అనయ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థి నులు పలు రకాల పూలతో బతుకమ్మలను సిద్దం చేసి ఆడుతూ, పాడుతూ సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, పండుగల ప్రాధ్యాతను వివరించేందుకు కృషి చేస్తున్నామని కళాశాల ఛైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.బయ్యపురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సైదిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గూటికి చేరిన జల్‌పల్లి రజకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని జల్‌పల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల్లో ఉంటున్న దాదాపు 40 రజక కుటుంబాల వారు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. జల్‌పల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సూరెడ్డి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో వారు సబితారెడ్డి నివాసానికి తరలివచ్చి గులాబి తీర్థం పుచ్చుకు న్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి వారికి బిఆర్ఎస్ కండువాలు వేసి ఆహ్వా నించారు. అనంతరం పార్టీలో చేరిన వారంతా యువ నాయకుడు పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి కృష్ణారెడ్డి, యాంజాల జనార్ధన్, సయిద్ పటేల్, పోలెమోని నాగేశ్, జంగయ్య, సయ్యద్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బినగర్ నియోజకవర్గ బారాస పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బీఫామ్ అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు. చిత్రంలో ఎమ్మెల్సీ మల్లేశం, వేం నరసింహారెడ్డి, వెంకటేష్‌గౌడ్ ఎల్.బి.నగర్ (హైదరాబాద్,ప్రభాతవార్త)

## వెంకటరమణ కాలనీలో స్పోర్ట్స్ హబ్ ప్రారంభం



స్పోర్ట్స్ హబ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాగుల తదితరులు

**వనస్థలిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** విద్యార్థులు క్రీడలలో రాణించి దేశ ప్రగతికి తోడ్పడాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొ న్నారు. డివిజన్ పరిధిలోని వెంకటరమణకాలనీలో ఏర్పాటు చేసిన ఆర్.ఆర్. స్పోర్ట్స్ హబ్‌ను బుధవారం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సంరెడ్డి బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్ గౌడ్‌లు మాట్లాడుతూ స్పోర్ట్స్ హబ్‌లో బాక్స్ క్రికెట్, క్రికెట్ కోచింగ్, బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర క్రీడలలో శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన కోచ్‌లచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సిఐ కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయిని శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలు : ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి



బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఉత్సవాలు సాంప్రదాయాలకు ప్రతి రూపాలని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యా ర్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను అందగా తీర్చిదిద్ది కళాశా ల ఆవరణలో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని దేవతగా పూజించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన బతుకమ్మ ఉత్సవాలను మన రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తా మన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులకు పండుగల గొప్పతనంతో పాటు వాటి ప్రాముఖ్యత, విశిష్టతలగురించి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాసాచార్యులు, అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శోభారాణి, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లలిత త్రిపుర సుందరిదేవిగా విజయదుర్గా



శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అలంకారంలో విజయదుర్గామాత

**సైదాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సైదాబాద్ మాతా మైదానంలోని శ్రీ విజయదుర్గామాత శరన్నవరాత్రుల సం దర్భంగా బుధవారం శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 19వ తేదీ గురువారం మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, 23వ తేది ఉదయం విశేష చండీ హోమం నిర్వ హించబడుతుందని అర్జం సునీల్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## బతుకమ్మఘాట్ వద్ద పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్ శ్వేత



పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

**సైదాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సింగరేణి ఆఫీసర్స్ కాలనీలోని బతుక మ్మఘాట్‌వద్ద పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పరిశీలిం చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి వీలుగా బతుకమ్మ ఘాట్ వద్ద తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.

## వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదుతో నేరేడ్‌మెట్ సీఐ..

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఎన్నికల కోడ్ ఉండడంతో నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నేరేడ్‌మెట్ సీఐ ఆధ్వర్యంలో సైనిక్‌పురి చౌరస్తా లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి పత్రం లేకుండా ఓ వ్యక్తి నుండి సుమారు 4లక్షల 50వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సీఐ శివకుమార్ మాట్లాడుతూ రూ. 50వేలకు మంచి నగదును తీసుకువెళ్ళకూడదన్నారు. ఒకవేళ సరైన పత్రం నగదును తీసుకు వెళ్ళవచ్చ న్నారు. లేనిపక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకొని జిల్లా ట్రెజరరీ కార్యాల యానికి తరలించడం జరుగుతుందన్నారు. రామక్రిష్ణపురం, నేరేడ్‌మెట్, సైనిక్‌పురి తదితర ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యకు పరిష్కారం : మంచిరెడ్డి

**తుర్కయంజాల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని జన చైతన్య కాలనీ 21 వ వార్డు 10 రోజుల నుంచి వాటర్‌లేక కాలనీవాసులందరూ చాలా ఇబ్బంది పడుతున్న విషయం గురించి కాలనీ వాసులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి విషయాన్ని తెలియజేసారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వాటర్ వర్క్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సి పాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నాకు తెలిజేయాలని వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు కొత్తకుర్మా కార్తీక్, కొంతం యాదిరెడ్డి, జొన్నాడ వెంకట్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, ఎర్రగుంట వెంకటేశ్వర్ రెడ్డి, సాయికుశాల్, రాగి చంద్రకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డిప్యూటీ తహశిల్దార్‌గా సైదిరెడ్డి

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** మల్కాజిగిరి రెవెన్యూ డిప్యూటీ తహశిల్దార్‌గా ఇ.సైదిరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయ డం జరుగుతుందని డిప్యూటీ తహశిల్దార్ సైదిరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం డి సెక్షన్‌లో అధికారిగా విధులు నిర్వహించిన సైదిరెడ్డి బదిలీలో భాగంగా మల్కాజిగిరి డిప్యూటీ తహశిల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్‌కు అండగా కాంగ్రెస్ : దేప

**హైదరాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఎంఆర్‌పిఎస్‌కు కాంగ్రెస్ పార్టీ ఎప్పు డూ అండగా నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ తలపెట్టిన విశ్వరూప మహాసభ బుధవారం మహేశ్వరం నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా మందకృష్ణమాదిగకు స్వాగతం పలికి శాలువాతో భాస్కర్‌రెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లా డుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం అనితర సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, బాకీజాను, ఇమ్రాన్‌అలీ, కనుముల సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుగుట్ట ఆలయంలో ఘనంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

**హైదరాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఉప్పల్ వెలుగుగుట్టలోని శ్రీ దుర్గా మల్లికార్జునస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభ వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుదవారం అమ్మవారిని శ్రీ కాత్యాయనిదేవిగా అలంకరించారు. ఆలయ కమిటి నేతలు గొరిగె మల్లేష్, సంతోష్,నవీన్, సూర్యప్రకాష్, గీతా లక్ష్మి, కవిత, దేవాలయ సిబ్బంది ఆధ్వ ర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చ న, పంచామృత అభిషేకం, చండీ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

## కట్ట మైసమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు

**హైదరాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయం దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటి అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, పన్నాల అర్జున్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాలలో అలంక రణ చేస్తున్నామని తెలిపారు. ఉత్సవా ల్లో భాగంగా బుధవారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి బీఫామ్ అందజేత



సిఎం కెసిఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** ఉప్పల్ అసెంబ్లీ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి బుధవారం సిఎం కెసిఆర్ బీఫామ్ అందజేశారు. బుధవా రం ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎం కెసిఆర్ చేతుల మీదుగా బండారి లక్ష్మారెడ్డి బీఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఉప్పల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిచి రావాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల కు వివరించాలని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఇంచార్జీ రావుల శ్రీధర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరికి కందికంటి పరామర్శ

**ఉప్పల్, అక్టోబరు 18 ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని బుధవా రం మల్కాజిగిరి టిడిపి నేత కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిర సనగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని, రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌కు ప్రజలుగుణపాఠం చెబుతారని విమర్శించారు. వచ్చే తెలంగాణ ఎన్ని కల్లో టిడిపి పోటీ చేస్తుందని, టిడి పితోనే పేదలకు న్యాయం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో బిసి, ఎంబిసి, డిఎన్‌టి సంఘాల బహిరంగసభ : శ్రీనివాస్

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిసి, ఎంబిసి, డిఎన్‌టి సంఘాల ఆధ్వర్యంలో త్వరలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని ఎంబిసి సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ వెల్లడించారు. ఆయా సంఘాల ముఖ్య నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసిన అర్హు లైన బిసిలకు బిసి బంధు ఇవ్వాలనీ, ఫెడరేషన్ సాకుతో ఎంబిసి జాబితా నుండి తీసివేసిన కులాలను జాబితాలో చేర్చాలని, చట్ట సభలకు పోటీ చేయడానికి అవకాశందక్కని కులాలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలని, బిసి ఫెడరేషన్‌లకు పాలకమండళ్ల ఏర్పాటు చేయాలనే డిమాం డ్లతో సభను నిర్వహించనున్నామని ఆయన వివరించారు. ఈ సభకు 84 బిసికులాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని ఆయన తెలిపారు.

## బాలాపూర్ మహాదేవర ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్టాపన



నంది విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామంలో సంతాన వేణుగోపాల స్వామి ఆలయం సమీపంలోనున్న పురాతన మహాదేవర శివాలయంలో కొత్తగా నంది విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ కొలన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాపక కార్యక్రమానికి హాజరైన మేయర్, మహేశ్వరం నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ ఆశావహురాలు చిగిరింత పారి జాత నర్సింహారెడ్డి హాజరై శివలింగానికి, నంది విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర జైహింద్, మల్లారెడ్డి, కొండల్, ఆంజనేయచారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి : ప్రిన్సిపల్ మధుసూదన్



సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థులు

**మలక్‌పేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తున్నామని ఐడియల్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ బి.మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ మధుసూదన్ మాట్లాడుతూ సీనియర్లు, జూనియర్ల మధ్య చక్కటి స్నేహభావం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లి దండ్రులు, విద్యా సంస్థలకు పేరు తీసుకురావాలన్నారు. విద్యారు ధ్ధులు పట్టు దల, అంకితభావంతో తమ లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్ భాగ్యలక్ష్మి, హెచ్ఓడి పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ : శ్రీలత



మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ చేస్తున్న శ్రీలత తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** దసరా పండుగను పురస్కరించుకొని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ సొంత ఖర్చులతో ఉమర్‌ఖాన్‌గూడలో మున్సిపల్ సిబ్బందికి దుస్తు లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం మనకు అనేక రకాలుగా వారు చేస్తున్నటువంటి సేవలకు గుర్తింపుగా, పరిసరాల పరి శుభ్రత ప్రజల యొక్క ఆరోగ్యమే ముఖ్యమని వారు చేస్తున్న కృషి వర్ణనా తీతమని వారి సేవలకు గుర్తింపుగా దసరా పండుగను పురస్కరించుకొని మున్సిపల్ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది జవాన్ పంది మురళి, వాటర్ మెన్ బాలయ్య, యాద గిరి, ఎలక్ట్రిషన్ ముత్యాలు, టోనీ, మున్సిపల్ కార్మికులు పంది మంజుల, గడ్డం జయమ్మ సత్యమ్మ, పోచయ్య, నరేష్, కలమ్మ పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యం : చల్లా నర్సింహారెడ్డి



కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రచారం చేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** ఈ సారి తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ పాత గ్రామం, శివశంకర్‌నగర్ కాలనీల్లో బుధవారం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చల్లా కవితా బాల్‌రెడ్డి, సిద్దాల మౌనిక శ్రీశైలం, పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రలు నిర వ్వహించి సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు ప్రకటించిన పథకాలపై కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విశ్వసించి తెలంగాణ ప్రజలు అధికారం ఇచ్చి పట్టం కడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవగోని కృష్ణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, పేట నర్సింహ, సిద్దుచారి, స్వామి నాయక్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, శేఖర్‌రెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రనగర్ కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభించాలని కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్ శాంతిశేఖర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కాలనీ వాసులు

**నాచారం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** రాజకీయాలు కాదు తమకు అభివృద్ధి ముఖ్యమని, తమ కాలనీలో వెంటనే డ్రైనేజీ పనులను ప్రారంభించాలని రాఘవేంద్రనగర్ ఫేజ్..3 కాలనీ వాసులు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శంకుస్థాపన నాడే ఇదే కాలనీలో ఒక బిజెపి నాయకుడు చేసిన గొడవ వల్ల కాంట్రాక్టర్ పనులు చేయనని వెళ్లి పోయాడు. ప్రస్తుతం కాలనీ వాసులందరు ఏకమై పనులను వెంటనే ప్రారం భించాలని కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు కార్పొరేటర్ స్పందించి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూస్తామని వారికి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో నరసింహ్మారావు, కృష్ణ, రాజు, హైదర్, రాములు, శ్రీనివాస్, బాలకృష్ణ, లక్ష్మణ్, ఆనంద్, పరమేష్, విఠల్ యాదవ్, రాజబాబు,సంతోష్, యాదగిరిరెడ్డి, సాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని దేవతగా పూజించే పండుగ బతుకమ్మ : ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి



బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న రాజేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ప్రకృతిని దేవతగా పూజించే పండుగ బతుకమ్మ అని ప్రగతి డిగ్రీ కాలేజ్ ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్ సుక్‌నగర్‌లోని తమ విద్యా సంస్థల ఆవరణలో వివిధ రకాల పూలతో బతుక మ్మలను సుందరంగా అలంకరించి, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో హాజరై ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదా యాలకు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. తొమ్మిది రోజులపాటు జరుపుకునే బతుకమ్మ పండుగను ఒక్కొక్క రోజు ఒక్కో పేరుతో పిలుచుకుంటారని తెలిపా రు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రిన్సిపల్ టి.చిన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆర్.జై చందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో నేడు అక్షయ ట్రస్ట్ అన్నప్రసాదశాల ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షయట్రస్ట్ అన్న ప్రసాదశాల మొదటి అంతస్తు గురువారం ప్రారంభమవుతుంది. గురువారం శ్రీభాష్యకార సిద్దాంత పీఠాధిపతి త్రిదండి రామచంద్రరామానుజ జీయర్ స్వామిచేతులమీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యు లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## బ్యాంకులో వ్యక్తి నుండి బంగారం, నగదును అపహరించిన వ్యక్తి అరెస్టు



నిందితుడి వద్దనుండి స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

**హయత్‌నగర్, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** నగదును అపహరించిన నిందితుడిని హయత్‌నగర్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునుగనూర్ మల్లికా ర్జుననగర్‌కు చెందిన సిరిగిడి ప్రకాష్ క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. జల్సాల కు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించే క్రమంలో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఈనెల 17న హయత్నగర్‌లోని హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకులో వ్యక్తిని ఏమార్చి 13.6 తులాల బంగారం, 50 వేల రూపాయల నగదును అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం హయత్‌నగర్‌లోని కుంట్లూరు రోడ్డులో మార్వాడిదుకాణంవద్ద అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ప్రకాష్ ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా ఆభరణాలు అమ్మడానికి వచ్చినట్లు తెలుసుకొన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి ఆభరణాలు, నగదును స్వాధీన పరుచుకుని రిమాండ్‌కు తరలించారు.